క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో శ్యామలాంబ



నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్యామలాంబ తల్లి

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ తల్లిని శ్రావణ మంగళవారం సందర్భంగా నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

పంట్ల కృష్ణకు పరామర్శ



కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ సాలూరు పట్టణ రైతు విభాగం మాజీ ఉపాధ్యక్షుడు పంట్ల కృష్ణను మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణ ఇంటికి మంగళవారం రాజన్నదొర వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ ఆరోగ్యపరిస్థితిని అడిగితెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల లైసెన్స్‌లు రద్దుచేస్తాం



మాంసం దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

సాలూరు: నిబంధనలు పాటించాలని ఎన్నిసార్లు చెబుతున్నా వినకుండా, పదేపదే నిబంధనలు మితిమీరి మాంసం విక్రయాలు జరుపుతున్న దుకాణాల లైసెన్స్‌లు రద్దుచేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పట్టణంలోని పెద్దబజార్, ఆర్టీసీ కాంప్లెక్, జైపూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మాంసం విక్రయ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాపార ప్రాంతం వద్ద బ్లీచింగ్ పౌడర్, జాల్స్ వేయాలని సూచించారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా నిబంధనలు పాటించకుండా విక్రయాలు జరుపుతున్న వ్యాపారులపై మండిపడ్డారు.ఇకపై మాంసం విక్రయాలు చేయడానికి వీల్లేదని, మీ వ్యాపార లైసెన్స్ రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కరాసవలసలో పొలం పిలుస్తోంది



కరాసవలసలో వరిపంటపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి శిరీష

సాలూరు రూరల్: మండలంలోని కరాసవలస, కొత్తవలస గ్రామాలలో ఏఓ కె.శిరీష ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు యూరియా మోతాదు తగ్గించి వాడాలని సూచించారు. యూరియా అధిక మోతాదులో వాడడం వల్ల పంటలు చీడపీడలకు గురవుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, రైతులు పాల్గొన్నారు.

కూర్మరాజుపేటలో పూడిక తీత



కాలువల్లో తీసిన పూడిక

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట గ్రామంలో కాలువల్లో పూడికపోయిన చెత్తలను మంగళవారం తొలగించారు. గ్రామంలో వర్షాకాలంలో ప్రధాన రహదారి బురదమయంగా ఉంటుంది. దీంతో గ్రామస్తులతోపాటు ఇదే గ్రామం మీదుగా వెళ్లే పునికిన వలస గ్రామస్తులు కూడా ఇబ్బంది పడుతుంటారు. అంతేకాకుండా ఈ గ్రామంలో రోజువారీ సేకరించిన చెత్తలు గ్రామం ప్రారంభంలో రోడ్డు పక్కన వేస్తుండడం, చెత్త కాల్చివేయడంతో వచ్చిపోయేవారికి ఇబ్బంది కరంగా మారుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నది ఒడ్డున షట్టర్ల వద్ద వేయడానికి బస్తాలకు ఇసుక లోడ్ చేస్తున్న రైతులు



ఆందోళనలో రైతులు

- కాలువ నుంచి రాని నీరు, కురవని వర్షాలు

సీతానగరం:

మండలంలోని సువర్ణముఖి నదిపై ఉన్న పెదంకలాం సాగు నీటి ప్రాజెక్ట్‌లో అభివృద్ధి పనులు చేపట్టకుండా సాగునీరు విడుదల చేసి రైతులకేమి ప్రయోజన మని ఏపీరైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల సత్యనారాయణ అన్నారు. సువర్ణముఖినదిపై పెదంకలాం సాగునీటి ప్రాజెక్ట్ వద్ద సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు ఇసుకబస్తాలతో లీకులు నివారించే పనులు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో ఉన్న కాలువ షట్టర్లు శిథిలావస్థకు చేరాయని, కాలువల్లో పేరుకుపోయిన పూడికలు పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేయకుండా కాలువల ద్వారా ఎమ్మెల్యే బి విజయచంద్ర నీరు విడుదల చేశారన్నారు. శివారు భూములవరకూ సాగునీరందిస్తామని చెప్పడం, రైతులను దగా చేయడమేనని ఒక్క జేసీబీ పెట్టి ఎన్నాళ్లు పని చేస్తారని ప్రశ్నించారు. నారాయణపురం, వెంగాపురం, బలిజిపేట, పలగర, తదితర గ్రామాల భూములకు సాగు నీరందడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కాలువ పరిధిలో ఉన్న ఆయకట్టు దారులు, ఆయాగ్రామాల రైతులంతా శిథిలమైన షట్టర్ వద్ద లీకుల నివారణకు ట్రాక్టర్‌తో ఇసుక బస్తాలు వేసుకుని నిర్దేశించిన భూములకు సాగునీరు సరఫరా చేయడానికి నాలుగు రోజులుగా రాత్రింబవళ్ళు శమిస్తున్నారని తెలియజేశారు. అయినా ఇంతవరకూ ప్రభుత్వంలో ఎటువంటి చలనం రాక పోవడం శోచనీయమన్నారు. ప్రాజెక్ట్ వద్ద షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడం వల్ల నదిలో నీరంతా వృథాగా పోతోందని, నీటిని పొలాలకు మళ్లించడానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో కోరుమ నాయుడు, వెంకటనాయుడు, రమణ, శ్రీనివాస్, సీపీఎం నాయకులు వై.మన్మథరావు, జనసేన నాయకుడు పైల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు నాయకులు

అనధికారికంగా వైద్యం చేస్తే చర్యలు

సీతానగరం: ప్రభుత్వ మెడికల్ అండ్ హెల్త్ రిజిస్ట్రార్ అనుమతులు లేకుండా వైద్యంచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసన్న కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి హెచ్చరించారు. ఈ మేరకు ప్రైవేట్ వైద్యులు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేయడం, ఎంతమంది వైద్యులున్నారు. ఎన్ని మెడికల్ షాపులున్నాయి, మెడికల్ షాపుల్లో వైద్య చేయడం తదితర అంశాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల మెజిస్ట్రేట్ ప్రసన్నకుమార్, మండల వైద్యాధికారి ఉషారాణి, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, పోలీసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాల బారిన పడుతున్న ప్రజల అవసరాలు, ఆందోళనను పరిశీలించి నాటు వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి క్వాలిఫైడ్ డాక్టర్లు, అనుభవం ఉన్న డాక్టర్‌తో వైద్య సేవలు పొందేవిధంగా మండల టీమ్ అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్య పర్చాలని, నాటువైద్యులపై ప్రత్యేకించి అవసరానికి మించి మందులు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మార్గ దర్శకాలు విడుదల చేశారన్నారు. అనంతరం మండల కేంద్రంలో మెడికల్ షాపులు, డిస్పెన్సరీలను తనిఖీ చేశారు.



ఆర్‌ఎంపీ వైద్యుల నుంచి స్వాధీనం చేసుకున్న మందులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ప్రాథమిక వైద్యాధికారులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

పార్వతీపురం రూరల్: గ్రామస్థాయిలో ఉన్న సంచివైద్యులు డబ్బుమీద ఆశతో ప్రజల ప్రాణాలు, వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటే తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తహసీల్దార్ ఎం.సురేష్ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు తహసీల్దార్, రూరల్ ఎస్సై, ప్రాథమిక వైద్యాధికారులు బృందంగా ఏర్పడి పుట్బూరు గ్రామంతో పాటు మండలంలోని ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి, సంగంవలస పరిధిలో గల సంచివైద్యుల కేంద్రాలపై ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ మేరకు ఆర్‌ఎంపీ వైద్యులు అందిస్తున్న సేవలు ఇస్తున్న మందులను పరిశీలించి ఇవ్వకూడని మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్నవారికి ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ప్రాథమిక చికిత్స వరకే పరిమితమై గుర్తింపు కలిగిన వైద్యుల వద్దకు సిఫార్సు చేయాలే తప్ప ఆర్‌ఎంపీ వైద్యులు ఇంజక్షన్లు, మలేరియా వంటి చికిత్సలు చేయడం చట్టరీత్యా నేరమవుతుందన్నారు. దాడుల్లో వైద్యురాలు ధరణి, రూరల్ ఎస్సై బి.సంతోషి, ఆర్ఐ మౌలాలి, స్థానిక వీఆర్‌ఓ పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలి

సీతానగరం: మండలంలోని విద్యార్థులు మాదక ద్రవ్యా(డ్రగ్)ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి విద్యార్థులుగా తయారై తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను మంగళవారం సందర్శించిన ఆయన విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ సూచనల మేరకు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులను చైతన్య పరుస్తున్నామన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

లీడర్ షిప్ శిక్షణ కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ శేషగిరి

సీతానగరం: మండలంలోని మరిపివలస షిరిడి సాయి పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో పాఠశాల హెచ్‌ఎంలకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి లీడర్ షిప్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ వి.శేషగిరి మంగళవారం సందర్శించారు. ఈ మేరకు శిక్షణ కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. అలాగే శిక్షణ కార్యక్రమంపై ఉపాధ్యాయుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమంలో ప్రదర్శిస్తున్న అంశాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ సామల సింహాచలం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నిమిత్తం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓ జి.కోటేశ్వరరావు, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుతో పాటు 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న అప్రెంటిస్ మేళా

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 11న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. పదవతరగతి, ఐటీఐ పాసైన వారితో పాటు గత నెలలో ఏఐటీ పరీక్షకు హాజరైన వారు అర్హులన్నారు.ఒరిజినల్ సర్టిఫికెట్లు, హాల్‌టికెట్ తీసుకుని ఈ నెల 11 ఉదయం 9 గంటలకు కళాశాలకు రావాలని సూచించారు. రూ.10,500 నుంచి రూ.15 వేల వరకు స్టైపెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కొసలు తుంచి నాటుకుంటే మేలు



వరి నాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏవో భారతి

మక్కువ: ముమ్మరంగా ఉభాలు జరుగుతున్నందున, వరిలో అధికంగా ఆశించే పీక పురుగు వరినారు కొసల వద్ద గుడ్లు, గుంపులుగా పెడుతుందని, నారు కట్టలు కట్టే సమయంలో నారు కొనలను తుంచడం వల్ల తర్వాత ఆశించే పురుగులను నాశనం చేయవచ్చని వ్యవసాయాధికారి సీహెచ్ భారతి అన్నారు. ఈ మేరకు మండలంలోని పనసభద్ర, దుగ్గేరు గ్రామాలలో పొలం పిలుస్తోంది, కార్యక్రమాన్ని ఏఓ సీహెచ్. భారతి మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిసాగులో పాటించాల్సిన యాజమాన్యంపై రైతులకు వివరించారు. అలాగే సుడోమోనాస్, క్లోరిఫైరిపాస్ ద్రావణంలో నారుకట్లను 10 - 15 నిమిషాల పాటు ముంచి నాటుకోవడం వల్ల ప్రధాన పొలంలో పీక పురుగు, ఆకు ముడత పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. వరి నాట్లు వేసుకునే సమయంలో 1 నుంచి 3 మొనలను 9 అంగుళాల దూరంలో నాటుకోవడం వల్ల శాఖీయ ఉత్పత్తి బాగా జరిగి, పిలకలు బాగా వేయడమే కాకుండా గాలి, వెలుతురు తగిలి చీడపీడలు ఉధృతిని తగ్గించుకోవచ్చని చెప్పారు. అలాగే ప్రతి రెండు మీటర్లకు 25 సెంటీమీటర్ల కాలిబాటలు కూడా ఏర్పాటు చేసుకోవాలని, దీనివలన అంతర కృషి, సస్యరక్షణ చర్యలు పాటించడం సులభం అవడమే కాకుండా వరిపైరుకు గాలి, వెలుతురు చక్కగా తగులుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెన్నెల, వీహెచ్‌ఏ రమణమ్మ, రైతులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు బాగుపడేదెన్నడో?




గుంతల మయంగా ఉన్న విశ్వనాథపురం రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పాచిపెంట: మండలంలోని జాతీయ రహదారి 26, నుంచి మంచాడ వలస మీదుగా విశ్వనాథపురం వెళ్లే 2.5 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దపెద్ద గుంతలు, కంకర తేలి ఉండడంతో వాహనాలు చెడిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ రహదారిపై ఒకటి, రెండు సార్లు వెళ్తే నడుమునొప్పి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో 108వాహనం రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. స్కూల్ బస్సులు కూడా గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.70 లక్షలతో రహదారి మంజూరై టెండర్ కూడా పూర్తయింది. ఈ లోగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఈ రహదారి గురించి కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు.

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి తర్వాత ప్రజలను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటైపోయిందంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని రహదారి పనులు చేపట్టి తమ కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



అడుగడుగునా గుంతలు ఉన్న రోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్ల ఊరికి స్కూల్ బస్సు కూడా రావడం లేదు. రోడ్డు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మా బాధలు ఎవరికీ పట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలి.

– గొర్ల మహేంద్ర నాయుడు, విశ్వనాథపురం

వ్యాధులను నియంత్రించాలి

పార్వతీపురం: ప్రస్తుత సీజన్‌లో వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులను తక్షణం నియంత్రించాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో ఆశవర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో మలేరియా కంటే డెంగీ, ఫైలేరియా వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సత్వరమే గుర్తించి సకాలంలో వైద్యపరీక్షలు చేసి మందులు వాడితే వ్యాధి తీవ్రత తగ్గుతుందన్నారు. దోమల్ని లార్వా దశలోనే అదుపుచేయడం చాలా తేలికన్నారు. దోమలను లార్వా దశలోనే నియంత్రించేందుకు ప్రతి ఏఎన్‌ఎం, ఆశవర్కర్ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేసి తగిన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర, వైద్యాధికారులు డా. రవిచంద్ర, డా.గణేష్, సూపర్ వైజర్లు పుష్ప, దీనమణి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ తదితరులు

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయమోహనరావు

బలిజిపేట: పీహెచ్‌సీల్లో గర్భిణుల నమోదు, ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వై.విజయమోహనరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట, గలావల్లి పీహెచ్‌సీలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఆశాడే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు వాటి ప్రాధాన్యంపై వివరించాలని సూచించారు. కిల్కారీ యాప్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత, కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీల రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు క్రాంతి కిరణ్మయి, బి.రేవతి, రుషికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట పీహెచ్‌సీలో వైద్యాధికారిణి, సిబ్బందితో మాట్లాడుతున్న విజయమోహనరావు

వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు కోరారు. రాష్ట్రవ్యాప్త డిమాండ్స్ డే సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే పిలుపుమేరకు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. పాత అక్రిడేషన్ల గడువును ఇక ముందు పొడిగించకుండా, రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్టుల యూనియన్స్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని, విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని మన రాష్ట్రంలోనూ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జర్నలిస్టులు వెంకటేశ్వరరావు, బాలి విశ్వేశ్వరరావు, రాపాక కూర్మారావు, బంకురు శ్రీనువాసరావు, రామ్మోహన్, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందిస్తున్న యూనియన్ నాయకులు, జర్నలిస్టులు

ఆశ వర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు,ఆశ వర్కర్లు

సాలూరు: ఆశ వర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఆశవర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్ వైనాయుడు, నాయకురాళ్లు రామలక్ష్మి, రాధ, భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆశవర్కర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు .ఆశవర్కర్లకు 62 సంవత్సరాలకు సర్వీసును పెంచాలని, రిటైర్ అయినప్పుడు బెనిఫిట్స్ అమలుచేయాలని, సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని , నేడు ఆశ వర్కర్లకు అందిస్తున్న అదనపు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న పార్వతీపురంలో నిర్వహించనున్న ఆశ వర్కర్ల మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, ఈ సభకు పెద్ద ఎత్తున ఆశ వర్కర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు సుబ్బలక్ష్మి, మాధురి, అనిత, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మక్కువ: స్కీమ్ వర్కర్లుగా ఉన్న ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల వద్ద మంగళవారం రాష్ట్ర ఆశ వర్కర్ల యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల నాయకులు కృష్ణారావు, దాలమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, కనీస వేతనాలు అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ఆశ వర్కర్లకు అనేక అదనపు పనులు అప్పగించి చేయిస్తున్నారని, వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అవుతున్న వారికి బెనిఫిట్స్ ఇవ్వాలని, 62 సంవత్సరాలకు ఉద్యోగ వయస్సు పెంచాలని కోరుతూ, ఈనెల 18న పార్వతీపురంలో మహాసభ జరుగుతుందని కార్యక్రమంలో ఆశవర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సరస్వతి, విజయ్ గౌరి, జానకి , ఉమామహేశ్వరి, అనిత, పార్వతి, నిర్మల, ఆశ వర్కర్లు, సీహెచ్ డబ్ల్యూఓలు పాల్గొన్నారు.



సమస్యల కరపత్రాన్ని చూపిస్తున్న ఆశ వర్కర్లు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: విద్యుత్ కార్యాలయం పరిధిలో ఉన్న 11కేవీ బెలగాం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న ప్రాంతాలలో లైన్ల నిర్వహణ కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రామారావు మంగళవారం తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సౌందర్య థియేటర్, వైకేఎం కాలనీ, మెయిన్ రోడ్ పరిసరాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.